# కాంగ్రెస్.. ఇదేం గుండాగిరి

- మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడి
- తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

తిమ్మాపూర్, అక్టోబర్ 27: కాంగ్రెస్ నాయకులు గుండాల అవతారమెత్తారు. అర్ధరాత్రి సమయంలో తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని దాడికి దిగారు. ఎమ్మెల్యే గన్‌మెన్లు, డ్రైవర్లను నానా దుర్భాషలాడుతూ బెదిరింపులకు గురిచేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన గోగూరి నర్సింహారెడ్డి, పోలంపల్లి ఎంపీటీసీ రమేశ్, మరో ముగ్గురు నాయకులు గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఎల్ఎండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. కారును బయట కొద్ది సేపు ఉంచగా.. డ్రైవర్ ఎవరు? అని వారి వద్దకు వెళ్లాడు. దీంతో దిగి వచ్చిన వాళ్లు రౌడీల అవతారమెత్తారు. 'ఎలక్షన్ కోడ్ ఉండగా.. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎలా ఉంటాడు' అంటూ సిబ్బందిపై దౌర్జన్యం చేశారు. కుర్చీలు, డస్ట్ బిన్లను పడేశారు. రూంలో ఉన్న గన్‌మెన్లను బయటకు లాక్కొచ్చారు. ఇదంతా వీడియో తీస్తున్న డ్రైవర్ ఫోన్ లాక్కుని బెదిరించారు. దీంతో భయభ్రాంతులకు గురైన డ్రైవర్.. ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి హుటాహుటిన వెళ్లి కాంగ్రెస్ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ వచ్చి సొంత పూచీ కత్తుపై వారిని తీసుకెళ్లారు.

## మేం రౌడీయిజం చేస్తే తట్టుకోరు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు హెచ్చరిక



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, పక్కన మానకొండూర్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు తీవ్రంగా ఖండించారు. 'మీ లాగా మేం రౌడీయిజం చేస్తే తట్టుకోలేరు' అని హెచ్చరించారు. శుక్రవారం మధ్యాహ్నం తిమ్మాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అర్ధరాత్రి సమయంలో ఎమ్మెల్యే అధికారిక నివాసంపై దాడికి దిగడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. గ్రామాల్లో ఆరు గ్యారంటీలని తిరుగుతున్నా.. ప్రజలెవరూ పట్టించుకోవడం లేదని, వారి ప్రచారం అట్టర్ ఫ్లాప్ అవుతుండడంతో తట్టుకోలేకనే ఇలాంటి వేశాలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. 'మీరు ఇప్పుడే ఇలా చేస్తే.. ఒకవేళ అధికారంలోకి వస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటనేది ప్రజలు గమనిస్తున్నారు. ఇప్పటికైనా కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలి' అని కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణకు హితవు పలికారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ముగ్గురు ఉంటే తాము మూడు వేల మందిమి ఉన్నామని చెప్పారు. తాము తలుచుకుంటే గ్రామాల్లో వారి ప్రచారాలే సాగవని హెచ్చరించారు. దమ్ముంటే నవంబర్ 30న చూసుకోవాలని, ప్రజలే తేల్చుతారని చెప్పారు. తమకు అధికారులు, ఎన్నికల వ్యవస్థపై నమ్మకం ఉందని.. అన్ని నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఓటర్లను మభ్యపెట్టి, ప్రలోభాలకు గురిచేసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తమ పార్టీ అధినేత సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తమకు క్రమశిక్షణ నేర్పారని, పథకాలను, అభివృద్ధిని చెప్పుకునే ఓట్లు అడుగుతామన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓ దొంగ అని, ఆయనే అలా ఉంటే మిరెలా ఉంటారని ఎద్దేవా చేశారు.

### కర్ణాటకలో కాంగ్రెస్ ఫ్లాప్

కర్ణాటక రాష్ట్రంలో ఆరు గ్యారంటీలని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అక్కడ అట్టర్ ఫ్లాప్ అయిందని, వారి పార్టీని ఎవరూ నమ్మవద్దని ప్రజలకు జీవీఆర్ పిలుపునిచ్చారు. అక్కడి రైతులు వచ్చి ఇక్కడ ప్రచారం చేస్తున్నారని చెప్పారు. దీంతో కాంగ్రెస్ నాయకులు తట్టుకోలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ క్యాడర్ ఇలాంటి పిచ్చికుక్కలను పట్టించుకోవద్దని, బీఆర్ఎస్ అధికారంలోకి రావడానికి శాంతియుతంగా పని చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, గన్నేరువరం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గంప వెంకన్న, సొసైటీ చైర్మన్ రాధాకిషన్‌రావు, నాయకులు వంతడుపుల సంపత్, బోయిని తిరుపతి, పారునంది జలపతి పాల్గొన్నారు.

## పథకాలకు ఆకర్శితులై బీఆర్ఎస్‌లో చేరికలు

గంగాధర, అక్టోబర్ 27: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై కాంగ్రెస్, బీజేపీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని ఆచంపల్లిలో బీజేపీ కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో స్థానికేతరులు ఎమ్మెల్యేలుగా గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. ఎన్నికల ముందు వచ్చి తర్వాత వెళ్లిపోయే నాయకులకు ఈ ప్రాంతంపై మమకారం ఉండదన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆకుల శ్రీలత-మధుసూదన్, సర్పంచ్ కొంకటి శంకర్, ఎంపీటీసీ కోలపురం లక్ష్మణ్, ఉపసర్పంచ్ అమ్ముల రాజు, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు కడపల మల్లేశం, నాయకులు కల్వల రాజ్‌కుమార్, సాయికుమార్, ప్రశాంత్, పర్శరాం, రాజు, మహేందర్, రాజు, మురళి, శ్రీకాంత్, రాము, ప్రదీప్, విపిన్, రాము, మహేశ్, రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



బీజేపీ కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రవిశంకర్

## కలెక్టర్, సీపీ బదిలీ

- కింది స్థాయి అధికారులకు బాధ్యతలు
- ఆదేశించిన ఎన్నికల కమిషన్

కరీంనగర్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ కలెక్టర్ బీ గోపి, సీపీ ఎల్ సుబ్బారాయుడును బదిలీ చేస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల విధుల్లో ఉన్న ఈ ఇద్దరు అధికారులను ఆకస్మికంగా బదిలీ చేస్తూ జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. కలెక్టర్ గోపి మూడు నెలల కిందటే బదిలీపై జిల్లాకు వచ్చారు. సీపీ సుబ్బారాయుడు 8 నెలలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బదిలీ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి రావాలని ఆదేశాలు ఉండడంతో ఎన్నికల విధుల్లో ఉన్న ఇద్దరు అధికారులు ఆకస్మికంగా విధుల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. కలెక్టర్, సీపీగా కింది స్థాయిలో ఉన్న అధికారులకు బాధ్యతలు అప్పగించాలని బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొనడంతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి అదనపు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. అలాగే, సీపీకి కింది స్థాయిలో ఇద్దరు డీసీపీలు ఉన్నారు. లా అండ్ ఆర్డర్ డీసీపీగా ఉన్న లక్ష్మీనారాయణ, అడ్మినిస్ట్రేషన్ డీసీపీగా ఉన్న రాజులో ఎవరికైనా ఒకరికి ఇన్‌చార్జి సీపీ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. కాగా, జిల్లాకు వచ్చిన ఈ ఇద్దరు అధికారులు అనతి కాలంలోనే తమదైన శైలిలో పాలన సాగించారు. కలెక్టర్ బదిలీపై వచ్చి మూడు నెలలు అవుతోంది. ఇంత తక్కువ కాలంలోనే ఆయన కింది స్థాయి అధికారులతో సన్నిహితంగా మెదిలారు. ప్రజావాణి, తదితర కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల ఫిర్యాదులను ఓపికగా పరిశీలించి పరిష్కరిస్తారనే పేరు వచ్చింది. సీపీ సుబ్బారాయుడు కూడా మంచి సౌమ్యుడిగా ఉంటూనే విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరించే వారు. ఆయన వచ్చిన కొద్ది రోజుల్లోనే నేరాలను అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వాహనదారులకు అవగాహన కల్పించడం, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇప్పించి వారిలో మార్పులు తెచ్చేందుకు కృషి చేశారు. అనతి కాలంలోనే ఇద్దరు జిల్లా ప్రజలు, అధికారుల మన్ననలు అందుకున్నారు.



ఎల్లవ్వ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి గంగుల కమలాకర్

## 'వశిష్ట' దవాఖానలో మహిళ మృతి

- దవాఖాన రిజిస్ట్రేషన్ రద్దు
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి గంగుల కమలాకర్
- త్రిమెన్ కమిటీతో విచారణకు ఆదేశం

విద్యానగర్, అక్టోబర్ 27: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఎదురుగట్ల ఎల్లవ్వ (45) కడుపునొప్పితో బాధపడుతూ ఈనెల 7న కరీంనగర్‌లోని వశిష్ట దవాఖానలో చేరింది. వైద్యులు పరీక్షించి ఫైబ్రాయిడ్ యూటరస్ హిస్టరక్టమి శస్త్ర చికిత్స చేశారు. అనంతరం ఈనెల 18న కుట్లు ఇప్పించుకొని ఇంటికి వెళ్లింది. తిరిగి ఈనెల 25న కడుపు నొప్పితో బాధపడుతూ దవాఖానలో చేరింది. వైద్యులు పరీక్షించి రక్తం గడ్డ కట్టినట్లు గుర్తించి శుక్రవారం మళ్లీ చికిత్స చేసేందుకు ప్రయత్నిస్తుండగా దవాఖానలోనే మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఎల్లవ్వ మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు. కాగా, విషయం తెలుసుకున్న మంత్రి గంగుల కమలాకర్ దవాఖానకు వచ్చి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ లలితాదేవితో మాట్లాడారు. దవాఖానను మూసివేసి శస్త్ర చికిత్స చేసిన వైద్యుల సర్టిఫికెట్‌ను రద్దు చేయాలని ఎన్ఎంసీకి సమాచారం ఇవ్వాలని సూచించారు. నిర్లక్ష్యం చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ లలితాదేవి మాట్లాడుతూ, వశిష్ట దవాఖాన అనుమతిని రద్దు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై విచారణకు త్రిమెన్ కమిటీ వేశామని, ఇందులో ఒక ప్రోగ్రాం ఆఫీసర్, ప్రభుత్వ దవాఖాన నుంచి జనరల్ సర్జన్, గైనకాలజిస్టులు ఉంటారని, నివేదిక అనంతరం దవాఖాన యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## రైతు విరోధి కాంగ్రెస్



మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు, పక్కన కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు

- రైతులను అణగదొక్కాలని చూస్తున్నది
- రైతుబంధు ఆపమన్నందుకు తగిన బుద్ధి చెప్పాలి
- ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచనే లేదు
- మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్, అక్టోబర్ 27: రైతులపై కక్ష తీర్చుకోవాలన్న ఆలోచనతోనే కాంగ్రెస్ రైతుబంధు ఆపేయాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిందని, ఆ పార్టీ రైతు విరోధి అని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు విమర్శించారు. ఓ వైపు బీఆర్ఎస్ రైతు సంక్షేమం కోసం పథకాలను అమలు చేస్తుంటే, అవి గిట్టని కాంగ్రెస్ మాత్రం రైతులను అణగదొక్కాలని చూస్తున్నదని, ఆ పార్టీ నాయకుల మాటల్లోనే ద్వేషం బయటపడుతున్నదని దుయ్యబట్టారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. ఇటీవల పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి 3 గంటల కరెంటు సరిపోతుందని మాట్లాడితే, ఇప్పుడు కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే రైతుబంధు ఆపేయాలంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతాంగం సంతోషంగా ఉండి పంటలు వేసుకుంటున్నదని, రైతులకు సాగు నీరు, ఉచితంగా 24 గంటల కరెంటు, పండిన పంటను ఊళ్లోనే కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఎప్పటికీ రైతుల పక్షపాతిగా నిలుస్తుందన్నారు. రైతులకు ఇన్ని మంచి పనులు జరుగుతుంటే చూసి ఓర్వలేని కాంగ్రెస్ కక్ష సాధింపునకు పాల్పడుతోందన్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 9.25 లక్షల మంది రైతులకు ₹7750 కోట్లు రైతుబంధు రూపంలో అందించామన్నారు. వచ్చే నెలలో యాసంగి పంట మొదలవుతుందని, పంట పెట్టుబడి కోసం అందించే రైతు బంధును ఆపమని కోరడం సరికాదని హితవు పలికారు. రైతుబంధును ఆపమన్న కాంగ్రెస్ నాయకులను ఏ ముఖం పెట్టుకొని వచ్చారని నిలదీయాలని రైతులకు సూచించారు. రైతన్నలు కాంగ్రెస్ పాలనలో అడుగు అడుగునా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కరెంటు కోసం అరిగోస పడ్డారని వాపోయారు. పండిన పంటను అమ్ముకోలేని పరిస్థితులు కాంగ్రెస్ పాలనలో ఉండేవన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు పరిస్థితిని మళ్లీ తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. రైతులందరూ ఆ పార్టీ కుటిల బుద్ధిని గమనించాలన్నారు. కాంగ్రెస్‌కు ఓటు ద్వారానే బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఎస్ఆర్ఎస్పీ చేపట్టి ఒక భాగమే పూర్తి చేసి అరకొరగానే సాగునీరు అందించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తున్నదని గుర్తు చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు వాల రమణారావు, గంట కళ్యాణి, గుగ్గిళ్ల జయశ్రీ, గందె మాధవి, బండారి వేణు, ఎదుర్ల రాజశేఖర్, నాయకులు అర్ష మల్లేశం, కాశెట్టి శ్రీనివాస్, కుర్ర తిరుపతి, సంపత్, ప్రశాంత్, నారాయణ, రవీందర్, సతీశ్, ఉయ్యాల శ్రీనివాస్, కుంభం అనిల్, హమీద్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.